

# మాయ లాంతరు





సంతోష్ సినిమా ముందు ఒంటరిగా నిలబడి మోహిని. ఉదయం తొమ్మిది. వర్షపు మబ్బుల హైదరాబాదు.

నలుగురైదుగురు డెలిగేట్లు అక్కడా, ఇక్కడా. మోహిని చుట్టూ పెద్ద గుంపు మూగి ప్రశ్నలు అడుగుతూనో, ఆటోగ్రాఫ్‌లు తీసుకొంటూనో ఉంటారని ఊహించుకొన్న నేను దిగులు పడ్డాను. వెళ్ళి పలకరించే లోపల మనోహర్ అట్టహాసంగా దిగబడ్డాడు. వెంట ఫిలిమ్ సొసైటీ కుర్రవాళ్ళు ఉన్నారు. మోహినిని చూడగానే ముఖాన్ని వెలిగించి, చాలా సినిమాటిక్‌గా దగ్గరకు లాక్కున్నాడు. ఏ ఫిలిమ్‌ఫేర్‌లోనో కనబడే దృశ్యంలా ఉంది.

నన్ను చూసి "ఓహ్! మై రైటర్ ఈజ్ ఆల్‌సో హియర్!" అంటూ పక్కనున్నవాళ్ళ వైపు తిరిగి "అతన్ని చూడండి. అతి మామూలుగా కనిపించే అతను ఒళ్ళు జలదరించే ఫిక్షన్ రాయగలడు. ఈ సినిమాకు స్క్రిప్టు అతనే రాశాడు. అండ్ యూనో హి యీజ్ ఏ దళిత్ రైటర్!" అంటూ నావైపు చూసి "దగ్గరికి రా! నిరంజనా! పరిచయం చేసుకో" అన్నాడు.

ఈ దృశ్యాన్ని నేను ముందే ఊహించాను. సరిగ్గా ఇట్లాగే ఉంటుందని నేనెందుకు ఊహించానో తెలియదుగానీ – ఇట్లాగే, ఇంత విప్పారిన ముఖంతో ఇంత నాటకీయంగా ఈ మనిషి మాట్లాడగలడని నాకు బాగా తెలుసు. బహుశా మోహినికి కూడా తెలుసు. సినిమాలో షాట్‌లా, బాగా రిహార్సు అయినట్లుగా ముగ్గురం ప్రవర్తించటం, నాకు నవ్వు తెప్పించింది.

నేను థియేటర్ లోపలికి వెళ్ళేసరికి లైట్లు ఆరిపోయి ఉన్నాయి. స్క్రీన్ దగ్గరి డయాస్ పై ఇఫి అమ్మాయి మనోహర్‌ని పరిచయం చేస్తోంది. "ఆకలేర్ సంధానే సినిమాలో మృణాల్‌దా చూపిన మార్గాన్ని ఈ సినిమాలో వాడుకొన్నాం. ఏరోజుకారోజు సినిమా స్క్రిప్టు రాసుకొంటూ – ఒక ట్రాజిడీని రీ-ఇన్‌వెంట్ చేస్తూ ఈ సినిమాని తీశాం. ఈ సినిమాని దళిత్ సినిమాగా రిఫర్ చేస్తున్నారు. బాధ దళితుల బాధ అనీ, దళితులు కాని వాళ్ళ బాధ అని రెండు రకాలుగా ఉంటుందా అనేది నా ప్రశ్న!" అన్నాడు మనోహర్ గంభీరమైన ముఖంతో. తర్వాత మోహినిని పిలిచారు. రెండు చేతులు జోడించి నమస్కరించటం తప్ప మోహిని ఏం మాట్లాడలేదు. 'నిరంజన స్క్రిప్టురైటర్' అంటూ నన్ను పిలవటం ఆశ్చర్యాన్ని కలిగించింది. సినిమాకు సంబంధించినంత వరకూ నా పేరు లేనట్లే అనుకొన్నాను. "ఒక దళిత ఉద్యమ నాయకురాలి మరణం ఈ సినిమా.

చంపబడ్డ ఆమె శవం నుంచి కోసిన శరీర భాగాలు ఆకాశంలోంచి జారిపడటంతో ఈ సినిమా మొదలౌతుంది. అదే గ్రామం, ఆ ప్రజల ముందే, ఆ సంఘటనని దుఃఖాన్ని రిక్రియేట్ చెయ్యడం గొప్ప అనుభవం. థ్యాంక్యూ" అంటూ డయాస్‌పై నుంచి దిగాను.

రెడ్డిపురంలో ఉదయం మామూలు పల్లెల్లో కనపడే ఉదయం. పొలాలకు పొయ్యేవాళ్ళు, పశువుల్ని మేతకు తోలేవాళ్ళు - సిల్‌హౌట్ నుంచి వెండి తీగల్లా లేత ఉదయపు ఎండ - సినిమా అక్కడ మొదలౌతుంది.

ఊరి చివర వాగు. వాగుకు అల్లంత దూరంలో గుడి - ఏరియల్ షాట్‌లో గొప్ప పెయింటింగ్‌లా కనిపిస్తుంది ఊరు. హఠాత్తుగా ఒక పెనుకేక. క్లోజప్‌లో - వాగు దగ్గర గుడి ముందర పదేళ్ళ పిల్ల. గుడి ముందర తెగిన మనిషి పాదం ముక్క. ఎండ మాయమై నల్లమబ్బు కప్పింది ఊరిని. ఆ పిల్ల అరుచుకొంటూ ఊళ్ళోకి వస్తుంది. ఊళ్ళోనూ జనం గుంపులు గుంపులుగా. అందరి ముఖాల్లో భయాందోళనలు. ఇళ్ళపైన, కరెంటు తీగలపైన రోడ్ల మధ్యన తెగిన శరీరభాగాలు -

క్లోజప్‌లో ఒక తెగిన చేతిని జనం పరిశీలిస్తూ ఉంటారు. ఆ చేతి గాజులు, సన్నని నునుపైన వేళ్ళు. 'మాలతి!' భయంతో నడికారు ఆడమనిషి అరుస్తుంది. 'అవును మాలతే'. 'నాయనో! తల్లో! మాలతమ్మను చంపేరు దేవుడో!' అంటూ ఆడవాళ్ళ కేకలు. దళితవాడ నుంచి ఆడవాళ్ళు పిల్లలు గుంపులు గుంపులుగా పరిగెత్తుకొస్తుంటారు. కుర్రవాళ్ళు పదిమంది జట్టుగా బయలుదేరి ఊరిచివర, వాగు వొడ్డున, బావుల్లో అంతటా వెతుకుతున్నారు. నరకబడ్డ కాలో, చిట్లిన తలో, తేలివచ్చే పాదమో దొరుకుతుందని. వాగు పక్కన బురదని కెలుకుతున్న ఇద్దరు పిల్లలకు బాగా కుళ్ళిపోయిన చర్మం కండరాలు చీకిపోయిన, ఎముకగా మిగిలిన చెయ్యి కనిపిస్తుంది. దాన్ని కండువాలో చుట్టి తెస్తుంటారు. మరోవైపు బావిలోంచి రెండు తెగిన మొండెం ముక్కలు దొరుకుతాయి. చాలాసేపటికి పోలీసుల, సర్పంచ్, వందలాదిగా జనం మూగుతారు. పక్క ఊళ్ళ నుంచి కూడా జనం పరిగెత్తుకొస్తున్న దృశ్యం. జనం ముఖాల్లో దుఃఖం, కోపం, హడావుడి. కార్లలో దిగి, కెమెరాలు సర్దుకొని పరిగెడుతున్న ప్రెస్‌వాళ్ళు. పెద్ద కాన్వాయ్ నుంచి దిగిన పోలీసులు - యుద్ధ రంగంలా ఉందా ప్రదేశం. జనం దుఃఖతీవ్రతలో మాలతి గురించి మాట్లాడుకొంటున్నారు. ఒక్కొక్కళ్ళు మాలతితో తమకున్న అనుబంధం చెబుతుంటారు. ఒక్కో పరిచయం ఒక ఫ్లాష్‌బాక్‌లా మాలతి కథ ఆవిష్కరింపబడుతుంది.

* * *

ఓపెనింగ్ షాట్స్ తీయడానికి దాదాపు పదిరోజులు పట్టింది. తెగిన శరీరం ముక్కలు అట్లా ఆకాశంలోంచి జారిపడటం పిక్చరైజేషన్ చాలా కష్ట మైంది. పూర్తయిన తరువాత మాత్రం ఆ షాట్సు అద్భుతంగా వచ్చాయి. మనోహర్ గొప్ప ఉత్సాహంగా ఉన్నాడు.

బాగా మబ్బులు పట్టి షూటింగ్ కాన్సిల్ చేసిన ఒకరోజు - అప్పటికి షూటింగ్ మొదలుపెట్టి వారం అవుతుంది. ఉదయం పది గంటల సమయం లో యాదమ్మ వచ్చింది. "పోరిని చంపినారు కొడుకులు!" అంటూ ఏడుపు మొదలుపెట్టింది. మోహిని కంగారుగా బయటకు వచ్చింది. తరువాత సందీప్ (సుందరం పాత్ర వేసినవాడు). మనోరమ, కశ్యప్, రోమి అందరూ కంగారుగా బయటకు వచ్చారు. యాదమ్మ మాలతికి వరుసకి పిన్ని అవుతుంది. మెట్లపై కూలబడి "ఎంత జబర్‌దస్తీగా పాడేది!" అంటూ ఒక ట్రాన్స్‌లోకి వెళ్ళిపోయింది. "జనం ఎగబడేటోళ్ళు. కాళ్ళకు గజ్జెలు గట్టి గుట్కా వద్దన్నా, సారాయి వద్దన్నా అని స్టేజీలపై పాట షురూ చేస్తే... 'వయసుకు పోరివేగాని నువ్వు మాకు అవ్వవే!' అంటుండేవాళ్ళు పల్లెల్లో వాళ్ళు. 'మనకు బ్రతుకు లేదవ్వా! తిరగ బడితేనే కొడుకులు మాట వినేది' అనేది" యాదమ్మ మాటలు కథాగానంలా ఉన్నాయి. గొప్ప జీవితం మా కళ్ళ ముందు నింపింది. బొడ్లోంచి ఒక మూటను బయటకు తీసింది. మాలతి ఫోటోలు. పసిపిల్లగా ఉన్నప్పటివి కొన్ని. ఎక్కువ మీటింగులలో తీసినవి. ఆ ఫోటోలు మోహినికిచ్చాను.

"యాదమ్మకు నేనే కబురు పంపాను. ఈ పూటంతా ఆమెతో గడుపు. మాలతి గురించిన కబుర్లన్నీ విను. ఆ అనుభవాల్నీ, దుఃఖాన్ని, సాహసాలన్నీ నీలో బొమ్మ కట్టనీ" అంటూ యాదమ్మ కబుర్లలోకి మోహినిని తోశాను.

అరగంట తరువాత మనోహర్ విసుగ్గా ఊడిపడ్డాడు. "వాటీజ్ దిస్ న్యూసెన్సు" అంటూ.

"మాలతి అనే జ్ఞాపకంలోకి మోహినిని ప్రవేశపెడుతున్నాం. ఈవిడ మాలతి బంధువు" అన్నాను.

"అంతా బంకమ్. నాలుగైదు వేలు లాగుదామని ఇట్లా ఎగబడతారు. డోంట్ ఎంటర్‌టైన్ దెమ్" విసుగ్గా లోపలికి వెళ్ళాడు. చిన్నబోయిన ముఖంతో యాదమ్మ వెళ్ళిపోయింది.

ఆ రాత్రి దాదాపు పదిగంటలకు మోహిని కబురు చేసింది. "ఉదయం వచ్చిన యాదమ్మ యింటికి వెళదాం" అంటూ బయలుదేరదీసింది.

ఒంటరి ఆకాశం. తెల్లని పూతలాగా వెన్నెల. పేర్చిన బొమ్మల్లా గుడిసెలు. అలసిపోయి పడుకొన్న పశువులు. గుడిసెల మధ్య నుంచి సన్నని చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. ఒక మృదువైన కంఠం. ఒక సామూహిక దుఃఖం

కలగలిసిన శబ్దం అది. మమ్మల్ని చూసి జనం లేచి నిలబడ్డారు. ఇంటి గడపలపై కూలబడి వాళ్ళ కబుర్లలో కలిసిపొయ్యాము. ఒక పాతికేళ్ళ అమ్మాయి గొప్ప ఉద్రేకంతో మాలతి గురించిన ముచ్చట్లన్నీ చెబుతుంది. ఆ అమ్మాయి పార్టీ వర్కర్‌లా ఉంది. మిగిలిన వాళ్ళకు అర్థంకాని ఎన్నో సంఘటనలని వివరిస్తోంది. లోకల్ ఎమ్మెల్యే గురించి, సుందరం గురించి కూడా. స్కూలు మాష్టారు సుందరం అదృశ్యం అవడానికి, మాలతిని చంపేయడానికి కారణాలు ఒకటే అని వివరిస్తుంది. చాలాసేపటికి మాలతక్కకు యిష్టమైన పాట అంటూ ఒక పాట ఎత్తుకొంది. ఊగిపోతూ, జుట్టంతా విడిపోయి – మహా ప్రవాహంలా మారిపోయిందా అమ్మాయి. భర్త శవాన్ని ముందు పెట్టుకొని, భర్త జ్ఞాపకాల్లోంచి పాడే పాట. సమాజాన్ని శపించే పాట. అప్పటికి రాత్రి పన్నెండు దాటింది. బయల్దేరుతున్న మాకు తోడుగా చాలా దూరం వచ్చిందా అమ్మాయి. తన పేరు సరళక్క అని చెప్పింది. తిరిగి వస్తుంటే ఒక దుఃఖపు పాట మమ్మల్ని వెనక్కు లాగుతున్నట్లుగా అనిపించింది. విడిది గృహం దగ్గరకు వచ్చినాక నన్ను ఒక క్షణం ఆపి "ఎందుకో దిగులుగా ఉంది" అంటూ నా చేతిని పట్టు కొంది మోహిని. ఆ చేతిని అట్లాగే చెంపకు ఆన్చుకొని, అట్లా ఎన్ని నిమిషాలో గుర్తులేదు. ఎక్కడి నుంచో సన్నటి వెలుగు మాపైబడి లోపలికి నడిచాం.

* * *

థియేటర్‌లో చప్పట్లు వినబడి ఉలిక్కిపడ్డాను. కోకాకోలా దృశ్యానికి ఆడియన్స్‌లో బాగా రెస్పాన్స్ వచ్చింది. జనంలో వస్తున్న నిర్లిప్తతకు, మెటీరియ లిస్టిక్ జీవితానికి ప్రతీకగా ఈ దృశ్యాన్ని తీశాడు మనోహర్. మాలతి గురించిన ఫ్లాష్‌బాక్, మాలతి మరణం తరువాత జనం జరిపిన ధర్నాలు, ఊరేగింపులు, సభలు తరువాత దృశ్యం యిది.

ఊరంతా హడావుడిగా ఉంది. ఊళ్ళోకి నాలుగు కోకాకోలా ట్రక్కులు వచ్చాయి. ఊరి నిండా పెద్దపెద్ద హోర్డింగులు.

"కోకాకోలా మాత్రమే తాగండి. కొబ్బరి బోండా, తాటికల్లు, పులిసిన మజ్జిగ – అవన్నీ మర్చిపోండి. దేవుడు కూడా ఇష్టపడే డ్రింక్‌ను మానవుడు తయారుచేశాడు. బిల్ క్లింటన్, టోనీ బ్లెయిర్, చైనా, జపాన్ నేతలు – ప్రపంచం మొత్తం కోకాకోలానే తాగుతున్నారు."

స్కూల్ ముందు ట్రక్కు ఆగుతుంది. కుర్రవాళ్ళు చుట్టూ మూగుతారు. కెమెరా ఫోకస్ కోలాసీసాపై పడుతుంది. సీసాల్లో డ్రింక్ ఎర్రటి చీకటిలా ఉంటుంది. మాలతి అదృశ్యమైందని, ఏమైందో చెప్పమని ధర్నా చేసి, ఊరేగిం పులు చేసి – ఆ కుర్రవాళ్ళు, కార్యకర్తలు కూడా కోలా ట్రక్కు చుట్టూ చేరతారు.

గుంపులోంచి తోసుకొంటూ ఒక కుర్రాడు బయటకు వస్తాడు. వాడి చేతిలో కోక్ సీసా. "మనిషికొకటి చొప్పున ఇస్తున్నారు ఫ్రీగా. ఎలక్షన్ స్పెషలట..." ఇంకో కుర్రాడినుద్దేశించి చెబుతాడు.

సీసా ఎత్తి పట్టుకొని - నోట్లో జారే కోలా - పలచని రక్తంలా తుప్పు మంటూ ఊస్తాడా కుర్రాడు.

"బాగాలేదా? ఇది చల్లబడ్డాకే తాగాలి. బహుశా రేపటి నుంచి ఇంటికో ఫ్రిజ్ ఫ్రీగా ఇస్తారేమో" పక్కనున్న మరో కుర్రాడి ఆశ. స్కూలు కుర్రాడు కోక్ సీసాతో సహా గుంపులోంచి బయటకు వస్తాడు.

"ఎక్కడైనా ఐసుగడ్డ తీసుకురా. ఐసుగడ్డ పెట్టుకొని ఆపైన దీన్ని పోసుకొంటే, చల్లగా మజాగా గొంతులోకి దిగుతుంది" పొలాల్లో పనిచేస్తున్న ఆడవాళ్ళు కూడా ఆశగా కోకాకోలా ట్రక్కువైపు వస్తారు.

"పిన్నీ! రేపటి నుంచి వంట చేసుకోనవసరం లేదట. బియ్యం ధర 16, 17 అని కంగారు పడనవసరం లేదట. పిజ్జాలు, బర్గర్‌లు మనకు ఊళ్ళోనే దొరుకుతాయట" కోక్ తాగుతూ ఎంతో సీరియస్‌గా చెబుతున్నాడు ఆ కుర్రాడు.

"మన ఊరికి 'కోకాకోలా పేట' అని పేరు మారుస్తున్నారట" మరో కుర్రాడు ఎక్కడి నుంచో అరుస్తుంటాడు.

దూరం నుంచి 'కోకాకోలా గుర్తుకే మీ ఓటు! రమేష్‌రావుకే మీ ఓటు!' అంటూ నినాదాలు సన్నగా వినిపిస్తుంటాయి.

ఆ సీన్‌ని కట్ చేస్తే రమేష్‌రావు డైరెక్టుగా స్క్రీన్‌పైకి వచ్చాడు. జీపు పై నుండి జనం వైపుకు చేతులు ఊపుతున్నట్లు, అనుచరుల వైపు రెండు వేళ్ళు 'వి' గుర్తు చూపుతున్నట్లు - అతని జీపు వెనక వందకుపైగా మోటారు సైకిళ్ళు, వాటిపై కుర్రవాళ్ళు - వాళ్ళు ఒక్కో గ్రామాన్ని దాటుతుంటే గ్రామాలలో పెద్ద ఎత్తున దుమ్ము లేచి - అంతా అదృశ్యమై, ఒక దుమ్ముతెర మాత్రం మిగులుతుంది.

తరువాత సీన్, రమేష్‌రావు ఇల్లు - ఇంటినిండా మనుషులు. రక రకాలుగా మంతనాలు చేస్తూ, హడావుడిగా అటూ ఇటూ తిరుగుతూ, ఒకచోట పోస్టర్లు, కటౌట్లు తయారవుతూ, ఇంకోచోట సెల్‌ఫోన్‌లో మెసేజ్‌లు చేరవేస్తూ-

గది లోపల, రమేష్‌రావు క్లోజప్ - బలిష్టమైన దేహం, ఆరడుగుల ఎత్తు. తీవ్రమైన చూపులు - ముఖంలో మొండితనం, పొగరు స్పష్టంగా కనిపి స్తుంటాయి. ఇంటి నిండా రాజకీయ నాయకుల ఫొటోలు, ఇంకోవైపు స్పష్టంగా కనపడే ఒక పులితల, జింక తల, భయాన్ని కలిగించే వాతావరణం - అద్దం ముందు నిలబడి చాలాసేపు మేకప్ అవుతుంటాడు రమేష్‌రావు. కాఫీ తాగుతూ వరండాలోకి అడుగుపెట్టాడు. కుర్రాడొకడు కొత్తగా ప్రింటు చేసిన పోస్టర్లు

చూపిస్తాడు. మంత్రి భుజం చుట్టూ చెయ్యి వేసిన దృశ్యం పోస్టరులో ఉంటుంది. ఇంకో కుర్రాడు కొన్ని పాంప్లెట్సు తెచ్చి చూపిస్తాడు. "ఎలక్షన్లని బాయ్‌కాట్ చెయ్యమని సుందరం సార్ జనానికి చెబుతున్నాడు" రమేష్‌రావు ఆ పాంప్లెట్‌ని నలిపి క్రింద పడేస్తుండగా ఆ సీన్ అయిపోతుంది.

* * *

మొదటి రెండు వారాలు షూటింగ్ చప్పుడు లేకుండా సాగిపోయింది ఏ హడావుడి లేకుండా. ఆర్టు ఫిలిమ్ కనుక ఎవరూ దీనిని గురించి పట్టించు కోలేదు. పక్క టౌన్ నుంచి వెలువడే ఒక వారపత్రికలో సినిమా గురించి కవర్ ఫీచర్ రావటంతోటే - మొత్తం వాతావరణం మారిపోయింది. అసలు మరింక షూటింగ్ జరుగుతుందనే ఆశ ఎవరిలోనూ కనబడలేదు. సి.ఐ. పదిమంది పోలీసులతో వచ్చి హడావుడి చేశాడు.

అయితే రెండోరోజుకు మనోహర్ మొత్తం వ్యవహారాన్ని చక్కబెట్టాడు. ఊరి పెద్దలతో, పోలీసు అధికార్లతో, మరికొద్దిమంది ముఖ్యమైన రాజకీయ నాయకులతో - పెద్ద పార్టీ ఏర్పాటు చేశాడు. హైదరాబాదు స్టార్ హోటల్ నుండి ప్రత్యేకమైన వంటకాలు, స్కాచ్ - ఊరి చివర తోటలో ఫ్లడ్‌లైట్ల వెలుగులో చర్చలు, రాజీలు జరిగిపోయాయి.

ఆరోజు నుంచే స్క్రిప్టు నా చేతిలోంచి జారిపోయింది. కథ తానే చెప్పి, డైలాగులు రాయమని - చెప్పటం మొదలుపెట్టాడు. మా యిద్దరి సంబంధాల మధ్యన అనవసరమైన కాఠిన్యం చోటు చేసుకొంది. సుందరాన్ని పోలీసులు అరెస్టు చెయ్యటం, జనం రాజకీయ నాయకుడి యింటిపై దాడిచేసి వారం రోజులు గృహ నిర్బంధంలో ఉంచటం, సుందరం అదృశ్యం కావటం లాంటి సంఘటనలు స్క్రిప్టు నుంచి తొలగించబడ్డాయి. ఊహించని షాకు - మాలతి, సుందరానికి మధ్య రొమాంటిక్ సంఘటనలు సృష్టించటం. "ఆవిడ గొప్ప కార్యకర్త అయితే కావచ్చు. అయితే ఆమె కూడా మనిషే. రక్తమూ, మాంసమూ, ఉప్పు, కారమూ ఉన్న ఆడదే" అన్నాడు. హతాశుడనయ్యాను.

ఆ రాత్రి జరిగిన మరో సంఘటన నన్ను నిలువునా కుంగిపొయ్యేలా చేసింది.

అర్ధరాత్రి తలుపుపై టక్‌టక్‌మంటూ చప్పుడు. తెరచి చూస్తే మోహిని. జుట్టు విడిపోయి, వీపుపై ప్రవహిస్తూ, తెల్లటి శాటిన్ నైటీ ఒంటిపైన మిలమిల లాడుతూ, నదీకన్యలా ఉంది.

లోపలికి నడుస్తూ "అడ్వాన్సు ఇచ్చారా" అని ఒక అప్రస్తుత ప్రసంగాన్ని మొదలుపెట్టింది. లేదని తల ఊపాను. "నీ మొహమాటం చూస్తే వినుగే

స్తుంది" అంటూ విసుగ్గా మూతి పెట్టింది. గొప్ప అభినయం - నొసలు చిట్లించి, మూతి సున్నాలా అయి. "గొప్ప నటిగా రూపొందుతున్నావు" అన్నాను సినిమా నుద్దేశించి. క్షణంపాటు తన కళ్ళలో మెరుపు. చటుక్కున ముందుకు వంగి, నా నుదుటిపై ముద్దు పెట్టుకొని 'థ్యాంక్యూ' అంది. గొప్ప ఆనందాన్ని ముఖం లో ప్రకటిస్తూ. "ఖర్చులకు వాడుకో" అంటూ ఒక కవరు చేతిలో పెట్టి - హఠాత్తుగా కంఠంలో దిగులు కమ్ముకొన్నట్లుగా అయి - "మన పరిచయం, స్నేహం దాదాపు ముగిసినట్టే. నీకు అప్పుడే చెప్పాను. మామూలు హౌస్‌వైఫ్ జీవితం నాకు నచ్చదని. అన్నీ చెరిపేసుకో. మోహిని ఒక మాయ లాంతరు అని సరిపెట్టుకో" గొంతు దిగులుగా కానీ స్థిరంగా ఉంది.

"మాయ లాంతరు సినిమాకి చక్కగా సరిపోతుంది టైటిల్‌గా" అన్నాను నవ్వు ముఖంతో.

"ట్రై టు బి సీరియస్. నాకో కెరియర్ కావాలి. దానికో మనోహర్ కావాలి" అని నావైపు సీరియస్‌గా చూసి "గుడ్ బై" అంటూ వెళ్ళిపోయింది.

* * *

స్క్రీన్‌పై సుందరం. దాదాపు ఆరురేళ్ళ తరువాత కనిపిస్తున్నాడు. ఎలిమెంటరీ స్కూలు టీచరు. ఖద్దరు లాల్చీ, పైజామా, నెరిసిన జుట్టు, వయస్సు యాభైకి పైనే ఉంటుంది. తేజోవంతమైన కళ్ళు.

స్కూలు ముందు రెండు వాన్లు ఆగడంతో దృశ్యం మొదలౌతుంది. ఇరవైమంది దాకా అందులోంచి దిగారు. వీడియో కెమెరా, యాంకర్లు వగైరా టీ.వీ. సిబ్బంది. రమేష్‌రావు ఎన్నికల ప్రచారానికి ప్రత్యేక కార్యక్రమాల షూటింగు. మైకు ఒకటి సుందరం ముందు ప్రత్యక్షమవుతుంది. అతను తిరస్కారంగా చూస్తూ లోపలికి వెళతాడు. లోపల బోర్డుపై వ్యాకరణం గురించిన విషయమేదో రాస్తుండగా - పిల్లల్లో కలకలం - సుందరం చొక్కా వెనుక కాలరు పట్టుకొని, ఈడ్చుకెళుతూ - సీన్ కట్ చేసి - రోడ్డుపైన వరుసగా కవులు నిలబడి రమేష్‌రావు గురించి పద్యాలు చదువుతుంటారు. టీవీ యాంకర్ వాళ్ళను ఇంటర్వ్యూ చేస్తూ - అంతసేపూ సుందరాన్ని ఈడ్చుకెళుతుంటారు. పదిమంది గూండాలు అతన్ని చితకబాది స్కూలు ముందు పడేస్తారు.

తరువాత సీన్ హాస్పటల్‌లో. సుందరం శరీరం నిండాకట్లు. డెలీరియమ్‌లో ఉంటాడు. చుట్టూ స్కూలు పిల్లలు, కొద్దిమంది మిత్రులు. సుందరం మూలుగుతూ మధ్యలో పెద్దగా మాట్లాడుతుంటాడు.

'వాద్లిమిర్ ఇల్యీచ్. నేనిక్కడ మరణిస్తున్న మనుషుల దేశంలో ఉన్నాను. నువ్వు చెప్పిన యీ సామ్రాజ్యవాద శక్తులన్నీ - చుట్టూ మూగి -

మా ముఖాలకు ఉన్న మాస్కులు, మా చేతులకు, కాళ్ళకు ఉన్న తాళ్ళు చూశావుకదా. మా కదలికలేవీ మా ఆధీనంలో లేవు. కలకత్తా వీధుల్లో, తెలంగాణా గ్రామాల్లో, వాడవాడలా లక్షలాదిమంది కామ్రేడ్సుని ఉగ్రూతలూగించిన నీ పేరు ఇప్పుడు హఠాత్తుగా మా శబ్దకోశాల నుండి మాయమైపోయింది!"

కుర్రవాళ్ళు కంగారుగా చూస్తుంటారు. "సార్ సార్" అని అతన్ని తట్టి- "ష్! మాట్లాడవద్దు. మహా కథకుడు చెహోవ్ మాట్లాడుతున్నాడు. నత్త గుల్లల్లో నివసించే మనుషుల గురించి చెబుతున్నాడు. ముసలి వాంకో గురించి చెబుతున్నాడు. విను, విను. మానవుడి కోసం మహాయుగం రాబోతుంది అంటున్నాడు."

హాస్పటల్ బయట ఎన్నికల కోలాహలం. శబ్దాలు. మైకులో సినిమా పాట. ఓటు వెయ్యమంటూ పెద్దగా నినాదాలు. ఈలలు, కేకలు.

ఫ్లాష్‌బాక్‌లో సుందరం గురించిన విషయాలన్నీ. మాలతితో పరిచయం. వెనుకబడ్డ జాతుల సమాఖ్యను ఏర్పాటు చెయ్యడం. జనంతో కలిసి పనిచేయటం. ఒక సుదీర్ఘమైన షాట్‌లో బహిరంగ సభ. మాలతి అద్భుతంగా పాటలు పాడటం - అదే మీటింగులో సుందరం ఉపన్యాసం - రాజ్యాధికారం కోసం వెనుకబడ్డ జాతులన్నీ సంఘటితం కావాలనటం -

తరువాత షాట్‌లో హాస్పిటల్. సుందరం ఇంకా డెలీరియమ్‌లోనే ఉంటాడు. "ఏమీలేదు. ఏమీలేదు. ఎవరూ చనిపోలేదు" అంటూ క్షణమాగి - మళ్ళీ ఉలిక్కిపడి "లేదు. ఆమె చనిపోలేదు. ఉత్తదే. మాలతి ఒక్కతైతేనే కదా చంపడానికి. వందలాది, వేలాది మాలతులు. అన్ని హత్యలు చెయ్యడానికి వాడికి చేతులు చాలవు."

మళ్ళీ ఫ్లాష్‌బాక్. మాలతి కనబడకుండా పోయిన తరువాత సుందరం నిరాహారదీక్ష. తాలూకా ఆఫీసు దగ్గర ధర్నా. తరువాత షాట్‌లో మాలతి తెగిన శరీర భాగాలు ఆకాశంలోంచి జారిపడటం - రిపీట్ అవుతుంది. నిరాహారదీక్షలో ఉన్న సుందరాన్ని పోలీసులు లాక్కువెళ్ళటంతో ఆ దృశ్యం ముగుస్తుంది.

తరువాత సీన్ హాస్పటల్‌లోనే. గాంధీలా వేషం మార్చుకొని - రమేష్ రావు సుందరం గదిలోకి వస్తాడు. సుందరం శరీరంపై కట్లు ఇంకా తీయలేదు. నీరసంగా పడుకొని ఉంటాడు.

"సాయంకాలం బహిరంగసభ. నువ్వు వచ్చి ఆశీస్సులు చెప్పు!" రెప్ప పడని కళ్ళతో అతన్నే చూస్తున్నాడు సుందరం. పక్కనే కూర్చున్న స్టూడెంటు (పదేళ్ళవాడు) ఒకటి, రెండు, మూడు, నాలుగు అంటూ అంకెలు లెక్క పెడుతూ, వేళ్ళు మూస్తూ తెరుస్తూ.

"నువ్వు రెండు నువ్వులు. ఒక నువ్వు అసెంబ్లీలో కూర్చుని, ఉపన్యాసాలు ఇస్తూ - మరో నువ్వు శిరస్సులను నరికే కత్తివి. నువ్వు ప్రభుత్వానివి. గూండావి. మృత్యువువి. దేశం మొత్తం ఇట్లా మృత్యు పరిపాలనలోకి వెళ్ళటం" సుందరం మాట్లాడటం ఆపివేస్తాడు. పక్కనున్న స్టూడెంటు ఇప్పుడు పేపరు తీసుకొని పెద్దగానే చదవటం మొదలుపెడ్తాడు. ప్రజల వద్దకు పాలన, స్వేచ్ఛ, పౌరహక్కులు, మనిషి, శవం, దుఃఖం, చరిత్ర, శరీరభాగాలు... కోపంగా బుసలు కొడ్తూ రమేష్‌రావు వెళ్ళిపోతాడు.

* * *

షూటింగ్ మొదలైన ఇరవై అయిదోరోజు, రాత్రి తొమ్మిది తరువాత మనోహర్ నా గదివైపు వచ్చాడు. "రా! ఇట్లా వెళదాం" అంటూ ముందుకు నడిచాడు. అభ్యర్థనలా లేదు. కమాండ్‌లా. మారుతీ జీప్సీ. అతనే డ్రైవ్ చేస్తున్నాడు. డొంక రోడ్డు దాటి, మెల్లగా తారురోడ్డుపైకి చేరింది జీపు. చాలా వేగంగా నడుపుతున్నాడు. రాత్రి పలుచని వెన్నెల. రోడ్డుపై ఒకటీ అర తప్ప వాహనాలు లేవు. "వెనుక బాస్కెట్‌లో బీర్ టిన్స్ ఉన్నాయి. అందుకో" అన్నాడు డ్రైవ్ చేస్తూనే. అందించాను. తాగుతూ "నువ్వూ తీసుకో" అన్నాడు. నవ్వుతూ వద్దన్నాను. "ఫోజా! బుద్ధిమంతుడు అనిపించుకోవాలనా? బుద్ధిమంతుల కాలం వెళ్ళిపోయింది నిరంజనా" అన్నాడు పెద్దగా నవ్వుతూ. "సినిమాకు టైటిలేమయినా ఆలోచించావా?" రెండో టిన్ను ఓపెన్ చేస్తూ అడిగాడు.

"మాయ లాంతరు!" అన్నాను.

గొంతు పెద్దదిగా చేసి "మాయ లాంతరేమిటి? మాయాబజారులా! కొంచెం మోడ్రన్‌గా ఉండాలి! 'కోకాకోలాపురం - కొన్ని సంఘటనలు' అని పెడదాం. వెరైటీగా ఉంటుంది!" అన్నాడు. నేనేం మాట్లాడలేదు.

"సుందరం, మాలతిల మధ్య అంత క్రూడ్‌గా సెక్స్ సీన్లు అవసరం లేదనుకొంటాను!" అన్నాను సీరియస్‌గా.

"యూ ఆర్ ఏ ఫన్నీ చాప్. మందు తాగటం, సెక్స్ అన్నీ నీ దృష్టిలో పాపాల్లాగే ఉన్నాయే" అన్నాడు వెక్కిరింతగా.

"నిబద్ధత గురించి, ఆదర్శం గురించి నేను చెబుతున్నాను. వాళ్ళిద్దరు నిబద్ధత ఉన్న కార్యకర్తలు" అన్నాను పోట్లాడే ధోరణిలో.

"దళితుల సెక్స్ జీవితం అంత రిజిడ్‌గా ఉండదని ఎవరో థీసిస్ రాశారని నువ్వే చెప్పావుగా" కడుపులో తిప్పినట్లయింది అతని మాట విని. అతనితో మాట్లాడాలనిపించలేదు.

బాస్కెట్‌లోంచి జీడిపప్పు పాకెట్ తీసి, ఒకటి నావైపు విసిరాడు. దాన్ని ముట్టుకోవాలనిపించలేదు. జీడిపప్పు నవులుతూ నావైపు సీరియస్‌గా చూస్తూ "నీకు చాలా గీర కదూ! నీలాగే చాలామంది దళిత యూత్‌ని చూశాను. చాలా పొగరుగా కనిపిస్తుంటారు. డిప్లమసి బొత్తిగా చూపించరు. అందుకే అవకాశాలన్నీ చేజారిపోతాయి" అంటూ భుజంపై చెయ్యి వేశాడు. ఆల్కహాలు వాసన గుప్పుమంది.

రోడ్డుపై వాహనాల చలనం తగ్గినట్లుంది. దాదాపు గంటకు పైనే డ్రైవ్ చేసినట్లున్నాడు. ఎంత దూరం వచ్చామో తెలియటం లేదు. "ఇంక వెనక్కు వెళదాం!" అన్నాను. వినిపించుకోలేదు.

"నాకు ప్రయాణాలంటే చాలా యిష్టం. గొప్ప ఐడియాలన్నీ యిప్పుడే క్లిక్‌మనేది" అన్నాడు.

కొద్దిదూరం పోయినాక జీపు స్లో చేసి "మోహినితో నీ పరిచయం ఎన్నాళ్ళ నుంచి?" అన్నాడు. నేనేం మాట్లాడలేదు. "నువ్వంటే చాలా ఇష్టం చూపుతుంది. గతంలో పరిచయమా?" అన్నాడు.

"అవును" అన్నాను ముక్తసరిగా.

"ఎట్లాంటి పరిచయం జస్ట్ హలో టైపా.... లేక...." నాకు చాలా విసుగేసింది.

"మేం పెళ్ళి కూడా చేసుకోవాలని అనుకొన్నాం. సరైన ఉద్యోగం లేక..." ఏక్సిలేటర్ బలంగా తొక్కాడు మనోహర్.

జీపు గాలిలో తేలుతున్నట్లుగా ఉంది. "యూ మీన్, యూ ఆర్ ఇంటిమేట్?" అర్థోక్తిగా ఆగిపోయాడు. నాకు చిర్రెత్తుకొచ్చింది.

"యస్! వుయ్ హావ్ సెక్స్ ఆల్సో...." ధన్నుమంటూ ఏదో రాయికి గుద్దుకొని జీపు ఆగింది. హఠాత్తుగా నావైపు తిరిగి, చొక్కా పట్టుకొని పిడికిలితో ముఖంపై బలంగా గుద్ది

"బ్లడీ లైయర్! నువ్వు చెప్పేదంతా అబద్ధం. మోహినిని తాకే అర్హత కూడా లేదు నీ ముఖానికి. గెట్ లాస్ట్ అవుటాఫ్ మై సైట్" అంటూ జీపులోంచి తటాలున క్రిందకు తోశాడు.

రోడ్డు అంచుపై పడి, అక్కడి నుండి రెండు అడుగులు కిందకు జారి - ఈ హఠాత్తు సంఘటనకు నేను దిమ్మెరపోయాను. జీపు వేగంగా వెళ్ళిపోయింది. గొప్ప దుఃఖం, కోపం కలిగాయి. పది నిమిషాలు అట్లాగే రోడ్డుపైనే కూర్చున్నాను. వెనక్కు వస్తాడేమోనని - పావుగంట దాటింది. జీపు ఆచూకి లేదు.

లేచి, రోడ్డుపై నిలబడి రెండు వైపులా చూశాను. అది ఏ ప్రాంతమో కూడా అర్థం కాలేదు. దూరంగా మిణుకు మిణుకుమంటున్న బల్బు కనిపించి అటువైపు నడిచాను. అరగంట నడిచిన తరువాత పెట్రోలు బంకు కనిపించింది. బంకువాడు మూసివేసే ప్రయత్నంలో ఉన్నాడు. దానికల్లంత దూరంలో టీ స్టాల్. మొలచుట్టూ లుంగీ కట్టుకొని, తమిళుడు అయ్యుంటాడు.

"రండిసార్ ! టీ తాగుదురుగాని..." అని ఆహ్వానిస్తున్నాడు. జేబులో పైసా కూడా లేదు. నైట్ డ్రస్‌లో అట్లాగే వచ్చాను. దగ్గరకు వెళ్ళి, మంచినీళ్ళతో ముఖం కడుక్కొని బల్లపై కూలబడ్డాను. హఠాత్తుగా నా కళ్ళ ముందు వెలుగు. టీ అందిస్తూ, నవ్వు ముఖంతో నావైపు చూస్తూ.... ఎప్పుడూ చూడని ముఖం. కానీ ఎంతో పరిచయమైన, ప్రియమైన ముఖంలా ఉంది. టీ తాగటం మొదలు పెట్టాను.

"నీ కథలు చాలా చదివాను. అందులోని సఫరింగ్, అలజడి నా కిష్టం" అన్నాడు. "స్క్రిప్ట్ ఎలా వస్తుంది?" అన్నాడు అన్ని రహస్యాలు తెలిసిన మాంత్రికునిలా.

"సుందరం... ఐమీన్ మీరే కదా హీరో సినిమాకు" నా ముఖంలో గొప్ప ఉత్సాహం. రాత్రంతా ఆయన కబుర్లు చెబుతూనే ఉన్నాడు. మనోహర్ సంగతులు కూడా చెప్పాను. ఉదయాన్నే ఒక లారీ ఆపి, ఎక్కించి "నేరుగా సిటీ వెళ్ళిపో. ఇక ఆ వెధవను మర్చిపో" అన్నాడు గుడ్‌బై చెబుతూ. పలుచటి మంచు కరిగి, వెలుగు ప్రవహిస్తుండగా, నాకు నిద్రపట్టింది.

* * *

థియేటర్లో నిశ్శబ్దం. సినిమా చివరి దృశ్యాలు.

కిటికీల్లోంచి, తలుపు సందుల్లోంచి ప్రతి ఖాళీలోంచి మిరిమిట్లు గొలిపే ఎండ. ఇల్లంతా పాకి ఒక వెచ్చటి ఆశ ఏదో ప్రవహిస్తున్నట్లుగా, సుందరం విరిగిన కాలు అతుక్కోనేలేదు. ఎన్ని ఎక్సరేలు తీసినా ఆ కాలు నియంత నిర్ణయంలా, రెండు విడివిడి ముక్కలుగానే కనిపిస్తుంది.

ఇద్దరు స్టూడెంట్లు వెంటరాగా హాస్పిటల్‌కు వెళుతున్న సుందరం.

ఎక్సరే చూస్తూ డాక్టరు "చాలా వింతగా ఉంది. ఈ విరిగిన కాలు ఎందుచేతనో అతుక్కోవటం లేదు. దాదాపు ఆరువారాలు దాటింది."

"ఇట్లా కాలు విరగటం, విరిగిన ఎముకలు మళ్ళీ అతుక్కోవటం, ఒక మెటాఫర్ అనుకొంటాను. విరిగిన నమ్మకాలు, ఆశలు..." సుందరం ఫిలాసఫీ చెబుతున్నాడు. హాస్పటల్ బయట గొడవ గొడవ. నాలుగైదు కార్లు. ఒక కారులోంచి రమేష్‌రావును మోసుకొని.... డాక్టరు హడావుడిగా వెళ్ళాడు.

డాక్టరు గదిలో సుందరం ఒక్కడే పచార్లు చేస్తూ... కిటికీ షేడ్ గాలికి అటూ ఇటూ కొట్టుకొంటూ గదిలో కాస్త వెలుగు, కాస్త చీకటీ... గడియారంలో గంట గడవటం చూస్తాడు.

"రమేష్‌రావు ఎట్లా ఉన్నాడు?" సుందరం.

"చావబోయి బ్రతికాడు. మాసివ్ ఎటాక్. భగవంతుడు లేడూ?" నిర్లిప్తంగా ఉంది డాక్టరు గొంతు. " వెళ్ళి చూడండి. ఐసియులో ఉన్నాడు."

ఐసియు బయట నలుగురైదుగురు కార్యకర్తలు. కాపలాగా నర్సు. కుంటు కుంటూ లోపలికి నడిచాడు సుందరం. "నిమిషంలో రండి" నర్సు సలహా.

మంచు నదిలా తెల్లగా, చల్లగా గది. మంచంపై రమేష్‌రావు. "ఏ హక్కులు, ఏ ఆశలు మిగల్చని నియంత- మరో నియంత, చావుముందు" సుందరం స్వగతం.

సుందరం ముఖంలో కసి. ముఖంలో వింత ఆనందం. బెడ్ దగ్గరకు వెళ్ళి ఆక్సిజన్ ట్యూబ్‌పై చెయ్యి వేసి - దాన్ని లాగి వెయ్యాలని. అట్లాగే మందు సీసాలోని ట్యూబును పీకేయాలని ప్రయత్నం - చివరి క్షణంలో చెయ్యి వెనక్కు లాక్కొని - గట్టిగా నిట్టూర్చి, రెండు అడుగులు ముందుకు నడిచి - ఏదో అనుమానం వచ్చినట్లు, మళ్ళీ వెనక్కు వెళ్ళి - రమేష్‌రావు ముఖం దగ్గర చెయ్యి పెట్టాడు. శ్వాస ఆగిపోయింది. సుందరం ముఖంలోకి ఆనందం ప్రవహించటం స్పష్టంగా తెలుస్తుంది.

"నియంత మరణం! నియంత మరణం!" గొణుక్కొంటూ బయటకు వచ్చాడు సుందరం.

సీన్ కట్ చేస్తే రోడ్డు.

శిలువల్లా మనుషులు, శరీరాల్ని ఈడ్చుకొంటూ.

వాతావరణం అంతా టీవీలో సీరియల్ సెట్టింగ్‌లా ఉంది. పక్కనున్న కుర్రాడితో రహస్యంగా "రమేష్‌రావు చచ్చిపోయాడు" గొప్ప ఉద్వేగంతో చెబుతున్నాడు సుందరం.

వాడు, సుందరంవైపు జాలిగా చూసి "ఏం సార్! పగటిపూటే కలగంటు న్నారా!" అన్నాడు.

"లేదు... హాస్పటల్లో... నేను... చూశాను" సుందరం మాటలు పూర్తి అవనే లేదు. మోచేతితో తట్టి "అటు చూడండి" అంటూ ఆవైపు వేలు చూపాడు. ఒక ఇంటి ముందు రమేష్‌రావు. ఇంటి ఇల్లాలికి కోకాకోలా సీసా అందిస్తూ "మన ఓటు గుర్తు ఇదే. గుర్తుంది కదా" అంటుండగా పక్కనున్న అనుచరులు "కోకాకోలా గుర్తుకే మీ ఓటు" అని అరుస్తుండగా నివ్వెరపోయాడు సుందరం.

మెల్లగా సుందరంవైపుకు నడిచి వస్తున్నాడు రమేష్‌రావు.

నవ్వుతూ, సుందరంవైపు తిరిగి "మిత్రమా! మన గుర్తు కోకాకోలా! గుర్తుంటుంది కదా!" అంటూ సీసా పైకెత్తాడు. వెంటనున్న అనుచరులు ఒక్కసారిగా "కోకాకోలా గుర్తుకి జై!" అంటూ అరుస్తున్నారు.

సుందరం ముఖంలో ఒక విభ్రమ -

చేతులు పైకెత్తిన వందమంది అనుచరులూ రమేష్‌రావులాగే ఉన్నారు. అతని క్లోనింగ్ సంతతిలాగా. "ఎలా సాధ్యం అయ్యింది?" అంటూ సుందరం నివ్వెరపోతుండగా - సినిమా ముగుస్తుంది.

థియేటర్‌లో పెద్దపెట్టున చప్పట్లు. హాలులో లైట్లు వెలిగాయి. యాభై మందికి పైగా మనోహర్ చుట్టూ మూగి అభినందనలు చెప్పసాగారు. డిడివాళ్ళ కెమెరా మనోహర్‌వైపు ఫోకస్ చేశారు.

"అయామ్ ఏ రెస్ట్‌లెస్ మాంక్! నా తరువాతి సినిమా కూడా ప్రజల మధ్యనే తీస్తాను. ఆదివాసీ జీవితాలపై ప్లాన్ చేస్తున్నాను. దానిలో కూడా మోహిని కథానాయికగా ఉంటుంది!" అంటూ మోహిని భుజం చుట్టూ చెయ్యివేసి "షి యీజ్ మై ప్రౌడ్ డిస్కవరీ!" అన్నాడు. ఫొటోలు, ఫ్లాష్‌లు. ఆ వెలుగును, గుంపును ఛేదించుకొని బయటపడ్డాను. సినిమా గురించి నాలో గొప్ప అసంతృప్తి, దిగులుతో బయటకు నడిచాను. భుజంపై ఏదో వెచ్చని స్పర్శ. సుందరం నా భుజం చుట్టూ చెయ్యివేసి నడుస్తున్న అనుభూతి. ఏదో ఓదార్పు. ధైర్యంగా - థియేటర్‌లోంచి అబిడ్స్ రోడ్డు వైపుకు కదిలాను.

*- ఆదివారం ఆంధ్రజ్యోతి, 19 సెప్టెంబర్ 1999*